క్లుప్తంగా

పరిశుభ్రత అందరి బాధ్యత

నింద్ర: మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని వైద్యాధికారి వినీషా అన్నారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జ్వరం అధిక రోజులు ఉంటే అది మలేరియా కావచ్చునని తెలిపారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్ఓ శ్రీదేవి, సిబ్బంది సురేష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



అవగాహన కల్పిస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీదేవి

కార్వేటినగరం: ప్రతి మహిళ ఒక వ్యాపారవేత్తగా ఎదగాలని డీఆర్డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఆర్డీఏ పీడీ మాట్లాడుతూ సబ్సిడీ ద్వారా బ్యాంకుల్లో అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళా ఒక వ్యాపారవేత్తగా ఎదగాలని పిలుపునిచ్చారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. ముఖ్యంగా వ్యాపారం చేసే వారికి రుణాలు తప్పనిసరిగా అందే విధంగా చూస్తామన్నారు. అనంతరం బ్యాంకులో ఎస్హెచ్జీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న టైలరింగ్ ఉచిత శిక్షణను సందర్శించారు. ఆమె వెంట ఇన్చార్జి ఎంపీడీఓ విద్యావతి, ఏపీఎం తదితరులు ఉన్నారు.

వైభవంగా గంగ జాతర



గంగాధరనెల్లూరు: మండలంలోని ముక్కలతూరు గ్రామంలో మంగళవారం గంగ జాతర వైభవంగా సాగింది. గ్రామస్తుల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి అంబళ్లు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించి అత్యంత భక్తిశ్రద్ధలతో జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి పిండి దీపంతో ప్రత్యేకంగా దీపార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. హరికథా కాలక్షేపం, ప్రత్యేక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సాయంత్రం అమ్మవారికి నిమజ్జన కార్యక్రం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అమావాస్య పూజలు



గుడిపాల: భద్రకాళమ్మను ఉయ్యాలలో ఊపుతున్న దృశ్యం

గుడిపాల: మండలంలోని నరహరిపేట సమీపంలో ఉన్న భద్రకాళమ్మ, బొమ్మసముద్రం గ్రామంలోని దుర్గాలమ్మ దేవాలయంలో మంగళవారం అమావాస్య పూజలు చేశారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం నిర్వహించారు. భద్రకాళమ్మ వద్ద అమ్మవారిని ఉయ్యాల సేవ నిర్వహించారు. భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

ఆర్టీసీ డిస్పెన్సరీ తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న డిస్పెన్సరీని ఎండీ ద్వారక తిరుమలరావు మంగళవారం తనిఖీ చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత బస్టాండును పరిశీలించారు. ఉద్యోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీసీ అప్పలరాజు, ఏడీఈ చెంగల్‌రెడ్డి, డీపీటీఓ జగదీష్ తదితరులున్నారు.

సమతులాహారంతో ఆరోగ్యం

గుడిపాల: విద్యార్థులు సమతులాహారం తీసుకుని శారీరకంగా, ఆరోగ్యంగా ఎదగాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఏఎన్ఎంలు జబసెల్వి, సరస్వతి అన్నారు. వారు మంగళవారం పేయనపల్లె, పసుమందలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు, మహిళలపై అఘాయిత్యాలు, నేరాలను అరికట్టే దిశగా అవగాహన పెంచాలన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగికదాడులు, నేరాలు, అఘాయిత్యాల సంబంధిత కేసుల నమోదు శాతాన్ని 0 స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ విలువలను పెంపొందించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కిశోర బాలికలపై చుట్టూ ఉన్న వారి ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఈ వయసు బాలికలకు శారీరక, మానసిక స్థితిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుందరేష్, మహిళా పోలీస్ పావని పాల్గొన్నారు.

ఉపాధి హామీ... వసతుల లేమి

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధిని కల్పించేందుకు కేంద్రం ప్రభుత్వం మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో పని చేసే కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని నిర్దేశించినప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. పనులు గ్రామాలకు దూరంగా జరుగుతుండడం.. మరోవైపు మండే ఎండలో చెమటోడ్చి పనిచేసిన వారికి కాసేపు సేదదీరడానికి నిలువ నీడ లేని దుస్థితి నెలకొంది. పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం.

– విజయపురం

- కనీస సౌకర్యాలు కరువు
- మండు టెండలో పని చేస్తున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు



నిలవడానికి నీడ లేక ఎండలో ఉన్న ఉపాధి కూలీలు

కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులు కల్పిస్తోంది. కానీ పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలను కల్పించడంలో ఉపాధి హామీ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. గ్రామాలకు దూరంగా అటవీ ప్రాంతాలలో మండుతున్న ఎండలో పనిచేస్తున్న కూలీలకు వసతులు కల్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. వసతులు కల్పించినట్లు రికార్డులు చూపిస్తున్నాయే కానీ సౌకర్యాలు మాత్రం ఎక్కడా కానరావడంలేదు. ఉపాధి హామీ పని వేళల్లో కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. చంటి పిల్లలను తల్లులు తమతో తీసుకొస్తే సమీపంలోని చెట్ల వద్ద ఊయలలు ఏర్పాటు చేసి కేర్ టేకర్‌ను నియమించాల్సి ఉంది. ఫస్ట్ ఎయిడ్ కిట్‌తోపాటు కూలీలు భోజనాలు చేయడానికి, సేదదీరడానికి టార్పాలిన్ పట్టలతో నీడ వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది. గునపాలు, పారలు, తట్టలు అందిస్తూ నివాస ప్రాంతానికి పని క్షేత్రం అయిదు కిలోమీటర్లు దాటితే రవాణా చార్జీలు, వేసవిలో పనిచేసే కూలీలకు వేసవి అలవెన్స్‌లను చట్టం మేరకు అందివ్వాల్సి ఉంది. అయితే సౌకర్యాలేవీ పనిచేస్తున్న క్షేత్రాల వద్ద కనిపించడం లేదు.

కానిరాని ప్రథమ చికిత్స కిట్లు

ఉపాధి కూలీలకు ప్రమాదవశాత్తు గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు మెడికల్ కిట్లు అందజేసేవారు. అవి ఇప్పుడు ఎక్కడా కనిపించట్లేదు. గాయాలైన వారిని నేరుగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. స్వల్ప గాయాలైన కూలీలు సొంతంగా గ్రామీణ వైద్యుల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు.

టార్పాలిన్ టెంట్లు లేవు

వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో గతంలో ప్రతి గ్రూపు ఒక టార్పాలిన్ టెంట్ అమర్చుకుని పని చేస్తుండేవారు. ప్రస్తుతం ఆ సదుపాయం లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండొచ్చినా.. వానొచ్చినా పని ప్రదేశాల్లో తలదాచుకోవడం కష్టమవుతోందని వాపోతున్నారు.

మండలం	పంచాయతీలు	పని చేసే కూలీలు
విజయపురం	25	1600
నింద్ర	21	1800
వడమాలపేట	22	2200
నగరి	19	1800

వాస్తవానికి జరుగుతున్నది ఇదే..

ఉపాధి కూలీలకు చట్టం మేరకు పూర్తి సౌకర్యాలను కల్పించడం లేదు. తాగునీటిని తమతోనే కూలీలు తీసుకెళ్తున్నారు. నీడను, పిల్లల కోసం కేర్ టేకర్, సేదదీరేందుకు టెంట్లను ఏర్పాటు చేయడం లేదు. రవాణా చార్జీలను వేతనంతో కలిపి చెల్లిస్తున్నారు. గడ్డపారలు, తట్టల సరఫరాను ఆపివేస్తూ పరికరాలను అద్దెకు రోజుకు 3 రూపాయల చొప్పున మాత్రమే కూలీలకు అందుతోంది.

ఇటీవల పన్నూరు అడవిలో ఉపాధి కూలీలను తీసుకెళ్లుతున్న ట్రాక్టర్ బోల్తా పడి సుమారు 19 మంది గాయపడ్డారు. వారి వెంట ప్రథమ చికిత్స కిట్టు కూడా లేకపోవడంతో గాయపడిన కూలీలు అల్లాడిపోయారు. ప్రథమ చికిత్స కోసం 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది.



ట్రాక్టర్ బోల్తా పడి నగరి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలు (ఫైల్)

బీమా సౌకర్యాన్ని కల్పించాలి

అడవుల్లో పని చేస్తున్న కూలీలకు భద్రత కరువైంది. పనిచేస్తున్న సమయంలో కూలీలకు ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స అందించడానికి కిట్లు కూడా లేవు. గాయపడిన వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందదు. కూలీలందరికీ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలి.

– కుమార్, పన్నూరు, సర్పంచ్

నీడ ఏర్పాటు చేయాలి

ఊరికి దూరంగా అటవీ ప్రాంతంలో ఉదయం వెళ్తే.. మిట్ట మధ్యాహ్నానికి ఇంటికి చేరుకుంటున్న కూలీలకు కల్పించే సౌకర్యాలను మెరుగు పరచాలి. అధికారులు సౌకర్యాల ఏర్పాటుపై శ్రద్ధ చూపిస్తే కూలీలకు మేలు చేసిన వారవుతారు. టార్పాలిన్ పట్టలు, పరికరాలు ప్రభుత్వమే సరఫరా చేయాలి.

– రాజయ్య, వేపగుంట

రక్షణ బుట్టలు ఏర్పాటు చేయాలి



మామిడి తోటలో ఏర్పాటు చేసిన పండు ఈగ బుట్ట

పుత్తూరు: మామిడి కోత దశలో ఉన్న నేపథ్యంలో తోటల్లో పండు ఈగ నుంచి రక్షణ కోసం బుట్టలు ఏర్పాటు చేయాలని ఉద్యానవన శాఖ అధికారి వెంకటసౌజన్య సూచించారు. ఆమె మంగళవారం పుత్తూరు మండలంలోని మామిడి తోటల్లో పర్యటించారు. కోత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సలహాలు ఇచ్చారు. మామిడి దిగుబడి సమయంలో ఈ పండు ఈగలు కాయలకు రంధ్రం చేసి లోపలి గుజ్జుని తినేస్తాయని, వీటి నివారణకు బుట్టలు ఏర్పాటు తప్పనిసరన్నారు. ఎకరాకు 6 నుంచి 8 బుట్టలు అమర్చుకోవాలన్నారు. తద్వారా పంటను రక్షించుకోవచ్చునన్నారు. అలాగే కాయలకు కవర్లు కట్టడంతో నాణ్యమైన దిగుబడి పొందవచ్చునన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం

నింద్ర: రైతులు అయిల్ పామ్ తోటలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని మేనేజర్ రజనీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటలు అన్ని రకాల నేలల్లో సాగు చేయడం అనుకూలమన్నారు. 3ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ ద్వారా నింద్ర మండలంలో పలు రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారన్నారు. ప్రతి రైతుకు సబ్సిడీపై మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. అంతర పంటలు కూడా వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 3ఎఫ్ కంపెనీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ అరుణ కుమారి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

పాలసముద్రం: మండల పరిధిలోని డీలర్లు తెల్లరేషన్ కార్డులకు అందించే నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ అరుణ కుమారి తెలిపారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేయరని తెలిపారు. వచ్చే నెల నుంచి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు చౌకదుకాణంలో డీలర్లు పంపిణీ చేస్తారని తెలిపారు. చౌక దుకాణం వద్ద తాగునీటి సౌకర్యం, నిత్యావసర సరుకుల ధరల బోర్డు తప్పక ఉండాలని తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు చౌక దుకాణంలో లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఇలా 15 రోజులు డీలర్లు నిత్యావసర సరుకులు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిధిలోని డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లోనే బియ్యం పంపిణీ

విజయపురం: వచ్చే నెల నుంచి రేషన్ షాపుల్లోనే బియ్యం సరఫరా చేస్తామని తహశీల్దార్ కిరణ్ తెలిపారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇంటింటికీ రేషన్ సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. వచ్చే నెల నుంచి రేషన్ బండి ఇంటింటికీ రాదని, ఇంకపై లబ్ధిదారులు రేషన్ షాపులకు వచ్చి బియ్యం తీసుకొంటారని, డీలర్లు సిద్ధంగా ఉండాలన్నారు.

ఉచిత శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో మంగళవారం డొమెస్టిక్ డేటా ఎంట్రీఆపరేటర్ ఉచిత కోర్సును ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్కిల్ హబ్ సెంటర్ ద్వారా వివిధ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలి బ్యాచ్‌లో 30 మందితో శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఓడీ టి.నరసింహులు, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ఎస్.రసూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర



గుడిపాల: ఊరేగింపుగా అంబళ్లను తీసుకెళ్తున్న గ్రామస్తులు

గుడిపాల: మండలంలోని కుప్పిగానిపల్లెలో మంగళవారం ఘనంగా గంగజాతరను గ్రామస్తులు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి అంబలిపోసి మొక్కులను చెల్లించుకున్నారు. సాయంత్రం పొంగళ్లు పెట్టారు. జాతరలో మాజీ సైనికులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి



క్రీడాకారులతో వైఎస్ఆర్ సీపీ నాయకుడు తాకిర్‌ఖాన్

కార్వేటినగరం: విద్యార్థులు గ్రామీణ స్థాయిలో నిర్వహించే క్రీడలను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని వైఎస్ఆర్ సీపీ మండల యువ నాయకుడు తాకీర్‌ఖాన్ అన్నారు. మంగళవారం డైట్ ఆవరణలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్రీడా కోచింగ్ క్యాంపును తాకిర్ ఖాన్ ప్రారంభించారు. వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్ తదితర పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులకు క్రీడా యూనిఫామ్ అందజేశారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ ముస్లిం నాయకులు రఫీ, ముస్తాక్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

231 మందికి యోగా శిక్షణ



వడమాలపేటలో యోగా శిక్షణలో అధికారులు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలో మొదటి రోజు 231 మందికి యోగా శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ శేషగిరిరావు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంతో పాటు ఎస్బీఆర్‌పురం, అప్పలాయగుంటలో శిక్షణ ఇచ్చారు. ఈ నెల 31వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని, ఆయన పేర్కొన్నారు.

యోగాపై ప్రత్యేక శిక్షణ

విజయపురం: మండల కేంద్రంలో సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ ఇచ్చారు. మంగళవారం మండల కార్యాలయంలో యోగా గురువు, రిటైర్డ్ ఎంఈఓ కైలాసం శిక్షణ ఇచ్చారు. అనంతరం ఈఓపీఆర్డీ రాజేంద్ర మాట్లాడుతూ యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి యోగా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం జీవన శైలిలో మానవులు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నారని గుర్తు చేశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఎవ్వరైనా యోగా నేర్చుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంకర లారీలతో నరకం



లారీ నుంచి జారి పడుతున్న కంకరపొడి, రోడ్డంతా పడి ఉన్న కంకరరాళ్లు

నగరి: క్రషర్ల నుంచి వివిధ ప్రాంతాలకు కంకర తరలించే లారీలు ఏ మాత్రం భద్రత పాటించడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కంకర పొడి తీసుకెళ్లే సమయంలో గాలికి అవి ఎగసి పడకుండా టార్పాలిన్ షీట్లతో కప్పి తీసుకెళ్లాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలు పాటించడం లేదు. లారీలపై టార్పాలిన్ షీట్లు కప్పకుండా కంకర పొడిని తరలిస్తున్నారు. ఇలా చేయడంతో లారీల వెనుకవైపు నుంచి జారిపడే కంకరపొడి గాలికి ఎగురుతూ వెళ్లి వెనుకవచ్చే వాహనదారులపై పడుతోంది. కళ్లలో దుమ్ము పడడంతో వారు పక్కకు వెళ్లి సరి చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ప్రమాదాలకు గురవుతామేమోనని భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డుపై పడే చిన్నరాళ్ల కారణంగా ద్విచక్రవాహనాల టైర్లు పంక్చర్లు అవుతున్నాయి. ప్రమాదాలు జరగక ముందే ఇలాంటి వాటిని అధికారులు అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం

- వేడుకగా స్నపన తిరుమంజనం, పల్లకి సేవ
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్కంధ పుష్కరిణిలో చక్రస్నానం, (ఇన్‌సెట్) ఉభయ నాంచారులు, స్వామివారితోపాటు చక్రతాళ్వార్‌కు తిరుమంజనం

కార్వేటినగరం: కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం ఉదయం 9గంటలకు చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు పల్లకి వాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. తొలుత ఆలయంలో మూలవిరాట్‌ను వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అలాగే చూర్ణాభిషేకం చేపట్టారు. అనంతరం ఊరేగింపుగా స్కంధ పుష్కరిణి వద్దకు చేరుకున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, చక్రతాళ్వార్‌కు వేద పండితులు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. 9.30 గంటలకు చక్రతాళ్వార్‌కు వేద మంత్రోచ్ఛారణ నడుమ స్కంధ పుష్కరిణిలో చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్కంధ పుష్కరిణి వద్దకు చేరుకుని చక్రస్నానంతో పునీతులయ్యారు. పుష్కరిణి వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గజ ఈతగాళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉభయ నాంచారులతో శ్రీవేణుగోపాలుడు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కంకణభట్టర్ తరుణ్‌కుమార్‌కి ఆనవాయితీ ప్రకారం పట్టు వస్త్రాలను టీటీడీ అధికారులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, వేదపండితులు నారాయణ దాశరథి, గోపాలాచారి, శబరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్, అలంకార భటులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ ఏడాది ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి





ధ్వజావరోహణం నిర్వహిస్తున్న వేదపండితులు, చక్రస్నానానికి హాజరైన భక్తులు

నేడు పుష్పయాగం

ఆలయంలో బుధవారం పుష్పయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, 9.30 గంటల నుంచి 10.30 గంటల మధ్య ఉభయనాంచారులతో స్వామివారికి స్నపన తిరుమంజనం ఉంటుందన్నారు. 1.30 గంటల నుంచి 3.30 గంటల మధ్య పుష్పయాగ మహోత్సవం జరుగుతుందని, సాయంత్రం 4.45 నుంచి రాత్రి 7 గంటల మధ్య స్వామివారి తిరువీధి ఉత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

వేసవి తాపం తీరింది



నగరిలో జోరు వర్షం

నగరి: వేసవి తాపాన్ని వరుణుడు చల్లబరిచాడు. ఎండలు తగ్గినా ఉష్ణోగ్రత ఎక్కువగానే ఉండడంతో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షాలు కాస్త చల్లదనాన్ని తెచ్చి, ఉక్కపోత నుంచి ఊరటనిచ్చాయి. మంగళవారం సాయంత్రం గంటపాటు జోరుగా వర్షం కురిసింది. అకస్మాత్తుగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు, ఆపై భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించడంతోపాటు రోడ్లపై వర్షపు నీరు పారింది.